నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 9 జూలై 2024 | ADILABAD NIRMAL


నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
బస్సులు నడవక.. బడికి పోలేక

నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

# బస్సు పునఃప్రారంభం

## 'నమస్తే' కథనానికి స్పందించిన ఆర్టీసీ అధికారులు

● 'నమస్తే' కథనానికి స్పందన

ఇచ్చోడ, జూలై 8 : ఇచ్చోడ మండలంలోని ఆయా గ్రామాలతోపాటు సిరికొండ మండల కేంద్రానికి బస్సు లేకపోవడంతో ఈనెల 3వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో 'బస్సులు నడవక.. బడికి పోలేక' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా ఆర్టీసీ అధికారులు విద్యార్థుల కోసం సిరికొండ మండల కేంద్రానికి ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు.. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామానికి ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు పునఃప్రారంభించడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మకు పునఃప్రారంభమైన ఆర్టీసీ బస్సు



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

## మౌలిక వసతులు కల్పించాలని ఆందోళన

ఎదులాపురం, జూలై 8 : ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని నిషాన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్న 300 కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలోని నిషాన్‌ఘాట్‌లో దాదాపు 300 కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, నలినిరెడ్డి, అమీనా బేగం, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.


నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్

## కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ ధర్నా

నిర్మల్ అర్బన్, జూలై 8 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాన్ని రూ.26 వేలు అందించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల కస్తూర్బా గాంధీ విద్యాలయాల నాన్ టీచింగ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 470 కేజీబీవీల్లో దాదాపు 5 వేల మంది నాన్ టీచింగ్ వర్కర్స్ పని చేస్తున్నారని, 12 గంటలపాటు శ్రమ దోపిడీకి గురవుతూ కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదని వాపోయారు. ప్రభుత్వాలు హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి రూప, కార్యదర్శి కవిత, పార్వతి, విజయ,శోభ, రాజలక్ష్మి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## ● ఆదిలాబాద్ జిల్లాలో..


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌తో యునియన్ నాయకురాలు

ఎదులాపురం, జూలై 8 : కేజీబీవీ,యూఆర్ఎస్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ, యూఆర్ఎస్ నాన్ టీచిం గ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీ, ఒక యూఆర్ఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయడం లేదని మండిపడ్డారు. నెలలో 30 రోజులపాటు విరామం లేకుండా పనిచేయడం వల్ల నాన్ టీచింగ్ వర్కర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. వారాంతపు సెలవు అమలు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు సునీత, జిల్లా నాయకులు గీత, శ్రీవెజమనోజ, మల్లయ్య పాల్గొన్నారు.


రిలేదీక్షల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

## జీవో పదిని రద్దు చేయాలి..

ఎదులాపురం, జూలై 8 : అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఇంటికి పంపించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ పదిని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, రాష్ట్ర అధ్యక్షురాలు సునీత దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 24 రోజులపాటు సమ్మె చేస్తే కాంగ్రెస్ నాయకుల తాము అధికారంలోకి రాగానే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు.


డొంగర్‌గాం నుంచి వాల్గొండ సబ్ సెంటర్‌కు కాలినడకన వెళ్తున్న గర్భిణులు

## గర్భిణుల అవస్థలు

**పక్క చిత్రంలో** కనిపిస్తున్న గర్భిణులు.. ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గాం, భీంజీతండా, శివగూడ గ్రామాలకు చెందిన వారు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎడ్లబండ్లు, అంబులెన్స్‌లు రాని దుస్థితి. ఈ క్రమంలో సోమవారం వాల్గొండ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు పది మంది గర్భిణులు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న శిబిరానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కాలినడకన తిరిగి ఇంటికి వచ్చామని ఆవేదన చెందారు. జిల్లా అధికారులు స్పందించి తమ గ్రామాలకు రోడ్లు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

- ఇంద్రవెల్లి, జూలై 8

# వినతుల వెల్లువ

● ప్రజావాణికి తరలివచ్చిన జనం ● సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు

*ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి భారీ సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. గత సోమవారం మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో ప్రజావాణి రద్దు కాగా.. ఈసారి జనం తాకిడి పెరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షాతోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ స్వయంగా దరఖాస్తులు స్వీకరించి, పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఇద్దరు దివ్యాంగులు వీల్‌చైర్స్ కోసం దరఖాస్తు చేసుకోగా.. కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు.*

- ఆదిలాబాద్, జూలై 8(నమస్తే తెలంగాణ)


పీఎం కిసాన్ యోజన డబ్బులు ఇప్పించాలంటూ ప్రజావాణికి వచ్చిన చాందా రైతులు

## పీఎం కిసాన్ డబ్బులు రావడం లేదు..

రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం డబ్బులు రావడం లేదంటూ ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులమైన తమకు ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి పెట్టుబడి సాయం అందడం లేదన్నారు. వ్యవసాయశాఖ అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్న ఫలితం లేదని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఉద్యోగాలు కల్పించాలంటూ వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులు

## 61 ఏండ్లు దాటిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

*రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 61 ఏండ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ వారి కుటుంబ సభ్యులు ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యూలర్ చేస్తూ వారసత్వ నియామకాల కోసం జీవో 81 జారీ చేసిందని, వివిధ శాఖల్లో ఉద్యోగాల కోసం తమ విద్యార్హతలు, ఇతర వివరాలు అందజేశామన్నారు. జిల్లాలో 87 మంది వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం స్పందించి తమ అర్హతల మేరకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.*

## బెల్ట్ షాపులను ఎత్తివేయాలి..

*జైనథ్(బేల), జూలై 8 : బేల మండలంలోని మాంగ్రూడ్ గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయని, యువత మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వెంటనే బెల్ట్ షాపులు ఎత్తివేయాలని, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించి ప్రజావాణిలో మాంగ్రూడ్ మహిళలు కలెక్టర్ రాజర్షి షాకు విన్నవించారు. అలాగే గ్రామానికి ఆర్టీసీ బస్సు నడక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయారు. ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అనురాధ, కల్పన, పూలాన్ బాయి పాల్గొన్నారు.*


కలెక్టర్ రాజర్షి షాతో మాట్లాడుతున్న మాంగ్రూడ్ మహిళలు

## కన్న కొడుకే కాలయముడయ్యాడు..

### కొడవలితో కన్నతల్లిని చంపిన తనయుడు


ఇందిరాబాయి (ఫైల్)

లోకేశ్వరం, జూలై 8 : కన్న కొడుకు చేతిలోనే తల్లి దారుణహత్యకు గురైన ఘటన లోకేశ్వరం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీనగర్ తండాకు చెందిన ఇందిరాబాయికి తన కొడుకు రాయబాబుకు రోజు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం కూడా తల్లీకొడుకులు గొడవపడ్డారు. ఆవేశంలో తల్లి ఇందిరాబాయిని కొడుకు కొడవలితో కడుపులో పొడిచాడు. దీంతో ఘటన స్థలంలోనే ఆమె మృతి చెందింది. ఘటన స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, ఏఎస్ఐ దిగంబర్‌లు సందర్శించి వివరాలు సేకరించారు.


మొదటి ఎంపిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

## కౌన్సెలింగ్ ప్రారంభం

బాసర, జూలై 8 : బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభం అయినట్లు అధికారులు తెలిపారు. మొదటి రోజు 1 నుంచి 500ల క్రమసంఖ్య వరకు పిలువగా.. 458 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ..అర్హులైన విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చామని, అభ్యర్థులు సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మొదటి ధ్రువీకరణ పత్రాన్ని సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని కొడికల్ గ్రామానికి చెందిన అన్న సాగర్ వితలేశ్వర్‌కు అందించి అభినందనలు తెలిపారు.

## చిరుత దాడిలో లేగదూడ మృతి

బజార్‌హత్నూర్, జూలై 8 : బందునాయక్ తండాలో చిరుత పులి దాడి చేసి లేగ దూడను చంపిన ఘటన బజార్‌హత్నూర్ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఫారెస్టు బీట్ అధికారి వివేక్‌రెడ్డి వివరాల ప్రకారం.. బందునాయక్ తండాకు చెందిన పుల్‌సింగ్ తన లేగదూడను శనివారం రాత్రి తన పశువుల పాకలో కట్టేశాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. లేగదూడ కోసం వెతుకగా అటవీ ప్రాంతంలో చనిపోయి ఉంది. దాని పక్కనే అడుగులు ఉన్నాయి. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. లేగదూడ విలువ రూ.10 వేలకు పైగా ఉంటుందని రైతు పేర్కొన్నాడు.


అటవీ ప్రాంతంలో చిరుత అడుగులు


గాదిగూడలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న స్థానికులు

## తాగునీటి కోసం తంటాలు

**గాదిగూడ మండల కేంద్రంలో పక్షం రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ బోరుబావి మోటర్ కాలిపోవడంతోపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో గుక్కెడు నీటి కోసం అవస్థలు తప్పడం లేదు. ఊరంతటికీ ఒకే బోరు బావి ఉందన్నారు. అయిన అధికారుల పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.**

- నార్నూర్, జూలై 8

## ఎస్పీ జానకి షర్మిల

*నిర్మల్ అర్బన్, జూలై 8 :* మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణం లో ద్విచక్రవాహనం నడుపు తున్న మైనర్లను ఆమె పట్టు కుని వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తుండడంతో వారిని పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటించకుండా మద్యం తాగి వాహనాలను నడుపడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోజు స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నా మన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు


వాహనాన్ని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ మైనర్ బాలుడు